క్లుప్తంగా

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు హనుమంతవాకలో అభయాంజనేయ స్వామి ఆలయ 22వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. హనుమంతవాక, విజయదుర్గా కాలనీ, క్రాంతి నగర్ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

సికింద్రాబాద్‌-సిల్చార్‌ రద్దు

తాటిచెట్లపాలెం: సికింద్రాబాద్‌-సిల్చార్‌(12513) ఎక్స్‌ప్రెస్‌ జూన్‌ 1వ తేదీన రద్దు చేసినట్లు వాల్తేర్‌ డివిజన్‌ అధికారులు తెలిపారు. ఎర్నాకుళం–టాటా (18190) ఎక్స్‌ప్రెస్‌ జూన్‌ 6 నుంచి 12వ తేదీ వరకు మళ్లించిన మార్గంలో వయా విజయనగరం, ఖుర్దారోడ్‌, కటక్‌, జక్‌పూర, జరోలి మీదుగా నడుస్తుంది. టాటా–ఎర్నాకుళం (18189) ఎక్స్‌ప్రెస్‌ జూన్‌ 7 నుంచి 14వ తేదీ వరకు మళ్లించిన మార్గంలో వయా జరోలి, జక్‌పురా, కటక్‌, ఖుర్దారోడ్‌, విజయనగరం మీదుగా నడుస్తుంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం 8వ నంబర్‌ ప్లాట్‌ఫాం వెనుక ఉన్న వెస్ట్‌సైడ్‌ బ్లాక్‌ వద్ద పునాదులు వేసి ఉంచిన సుమారు 5 అడుగుల లోతు నీరు కలిగి ఉన్న ఓ చెరువులో సుమారు 50 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి గురువారం మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఐదో పట్టణ ఎస్‌ఐ రవికుమార్‌తోపాటు హెడ్‌ కానిస్టేబుల్‌ మూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ప్రాంతంలో చుట్టుపక్కల ఉన్న యాచకులు తదితరులు అక్కడే నివసిస్తూ, ఆ నీటిలోనే స్నానాలు చేస్తుంటారని, మృతుడు కూడా చిత్తు కాగితాలు ఏరుకుంటూ, అక్కడే స్నానం చేస్తుంటాడని, ఆ చుట్టుపక్కలే జీవిస్తుంటాడని స్థానికులు చెబుతున్నారు. జ్ఞానాపురం మహిళా పోలీస్‌ లావణ్య ప్రియ ఫిర్యాదు మేరకు హెడ్‌ కానిస్టేబుల్‌ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్‌ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



సినీ గీతం పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట: సూపర్‌స్టార్‌ కృష్ణ జయంతి సందర్భంగా పల్లవి మ్యూజిక్‌ సినీ సాంస్కృతిక సంస్థ గురువారం సాయంత్రం ద్వారకానగర్‌ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి శ్రోతలను అలరించింది. బి.ఫణిభూషణ్‌ పాడిన తెలుగు వీర లేవరా, పల్లా బాబ్జీ, పావని పాడిన దోరవయసు చిన్నది, అంజనేయరెడ్డి, అంబిక పాడిన ఈ గాలిలో ఎక్కడో అలికిడి, వెంకటేష్‌ మాస్టారు, స్వరూప పాడిన ఎక్కడో చూసిన జ్ఞాపకం, వీరేంద్ర, భాగ్యలక్ష్మి పాడిన నమస్తే.. సుస్వాగతం హుషారైన పాటలు ప్రేక్షకులను ఉత్సాహపరిచాయి. వీరికి కీబోర్డుపై సోమేశ్‌, తబలాతో ఏవీ చలం, ప్యాడ్స్‌తో బాబ్జీ, గిటార్‌తో రమణమూర్తి వాద్య సహకారం అందించారు.

పెదగదిలి వంతెనపై రయ్‌.. రయ్‌..



బ్రిడ్జిపై యథాతథంగా తిరుగుతున్న వాహనాలు



వంతెనకు ఇరువైపులా వేసిన బీటీ రోడ్డు

ఆరిలోవ: పెదగదిలి నుంచి తోటగరువు వెళ్లే మార్గంలో గెడ్డపై చేపట్టిన వంతెన నిర్మాణం పూర్తయింది. కొద్ది రోజుల్లో అధికారికంగా ప్రారంభం కానుంది. రెండు రోజుల క్రితం బ్రిడ్జికి ఇరువైపులా తారు రోడ్డు నిర్మాణం పనులు కూడా పూర్తయ్యాయి. సుమారు రెండు వారాలుగా ఈ వంతెన అనధికారికంగా వినియోగంలోకి వచ్చింది. ఇక్కడ గతంలో ఉన్న ఇరుకుమయంగా శిథిలావస్థలో ఉన్న పాత బ్రిడ్జిని జీవీఎంసీ అధికారులు తొలగించారు. దాని స్థానంలో సుమారు రూ.4 కోట్ల నిధులతో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. సుమారు రెండున్నర నెలల్లోనే నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం విశేషం. ఐదు లైన్ల బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి నుంచి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల మీదుగా తోటగరువు వరకు వెడల్పయిన రోడ్డు ఉంది.

ఈ రెండింటి మధ్య గెడ్డపై ఇరుకైన 30 అడుగుల బ్రిడ్జి ఉండేది. ఈ ఇరుకు బ్రిడ్జి వల్ల వాహనచోదకులు ఇబ్బందిపడేవారు. ఇప్పుడు దీన్ని జీవీఎంసీ అధికారులు 80 అడుగులకు విస్తరించారు. దీంతో కొన్ని దశాబ్దాలుగా ఉన్న ఇరుకు బ్రిడ్జికి ఇప్పుడు మోక్షం కలిగింది. దీనిపై వాహనరాకపోకలు యథేచ్ఛగా సాగుతున్నాయి. బ్రిడ్జి



ఇరుకుగా ఉన్న పెదగదిలి బ్రిడ్జి(ఫైల్‌)

నిర్మాణం త్వరగా పూర్తి చేయడంపై ఆరిలోవ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్మిక హక్కుల రక్షణ కోసం నిరంతర పోరాటం

ఆరిలోవ: కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ నిరంతర పోరాటం చేస్తుందని యూనియన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌.కె.ఎస్‌.వి.కుమార్‌ తెలిపారు. సీఐటీయూ 54వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విమ్స్‌ వద్ద కార్మికులు యూనియన్‌ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ 1970లో సీఐటీయూ ఏర్పడినప్పటి నుంచి ఇంత వరకు ఐక్యత–పోరాటం అనే నినాదంతో కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందన్నారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఎన్నో త్యాగాలతో సాధించిన కార్మిక చట్టాన్ని రద్దు చేసి లేబర్‌ కోడ్స్‌ను తీసుకువచ్చిందన్నారు. కాంట్రాక్ట్‌, ఔట్‌ సోర్సింగ్‌ విధానాన్ని రద్దు చేసి కార్మికుల నియామకాలు రెగ్యులర్‌ పద్ధతిలో చేపట్టాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో పలు కార్మిక యూనియన్ల నాయకులు రాజేశ్వరి, పార్వతి, కనకరాజు, సింధూ, అన్నపూర్ణ, ఈశ్వరరావు, వెంకటరావు, విమ్స్‌ ఆస్పత్రి వర్కర్లు పాల్గొన్నారు.



విమ్స్‌ వద్ద యూనియన్‌ జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్‌

వాకర్స్‌కు ఉచిత వైద్య పరీక్షలు



ఎంవీపీ కాలనీలో వాకర్స్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆరిలోవ: ఎంవీపీ కాలనీలో వీఎస్‌సీ వాకర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో గురువారం ఓమ్ని ఆర్కే ఆస్పత్రి సిబ్బంది ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఉదయం నడక కోసం వెళ్లే సుమారు 40 మందికి వైద్య సిబ్బంది బీపీ, మధుమేహం పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి వాకర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు పి.కిశోర్‌కుమార్‌, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పక్కాగా ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే



సర్వేలో పాల్గొన్న సహిత విద్య కో–ఆర్డినేటర్‌ గీత, ఎంఈవో రామారావు

విశాఖ విద్య: ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు జిల్లాలో చేపడుతున్న సర్వేపై శ్రద్ధ తీసుకోవాలని సహిత విద్య కో–ఆర్డినేటర్‌ గీత కోరారు. ఐఈఆర్పీలు చేపడుతున్న సర్వేను గురువారం నగరంలో ఆమె పరిశీలించారు. సీతమ్మధార మండలంలోని శ్రీనివాసనగర్‌ నిర్వహిస్తున్న సర్వేలో ఎంఈవో రామారావుతో కలసి ఆమె పాల్గొన్నారు. భవిత టీచర్లు జగదాంబ, శారద ఇంటింటికీ గుర్తించిన పిల్లలకు పాఠశాలల్లో చర్చించేలా వారికి అక్కడికక్కడే అడ్మిషన్లు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. సర్వే పక్కాగా చేపట్టాలని సూచించారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని వినియోగించుకోవాలంటే తప్పనిసరిగా సర్వేలో నమోదై ఉండాలన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, సర్వేను విజయవంతం చేయాలని ఐఈఆర్పీలకు సూచించారు.

నేడు కూడా తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్‌ : కొమ్మాది పంపు హౌస్‌కు సంబంధించి పంపు సెట్‌ మరమ్మతులు చేపట్టిన దృష్ట్యా శుక్రవారం జోన్‌–2 పరిధి 9, 10 వార్డుల్లోని అన్ని ప్రాంతాలు, చినగదిలి, పెదగదిలి, సూర్యతేజనగర్‌, గాంధీనగర్‌, బాలాజీనగర్‌, అన్నానగర్‌, పాత ఆరిలోవ, సాలిపేట, సాగర్‌నగర్‌, గుడ్లవానిపాలెం, సుభాష్‌నగర్‌, వివేకానందనగర్‌, తాటిచెట్లపాలెం, దసపల్లా లేఅవుట్‌, రాజీవ్‌నగర్‌, రెడ్డీస్‌ కాలనీ, పెద రుషికొండ, చిన్న రుషికొండ, ఎండాడ ఎస్సీ, బీసీ కాలనీ, జోన్‌–3 పరిధి ఎంవీపీ కాలనీ సెక్టార్‌ 1 నుంచి 12తో పాటు పలు ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని పర్యవేక్షక ఇంజినీరు కేవీఎన్‌ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

దాహార్తి తీరుస్తున్న చలివేంద్రాలు

మద్దిలపాలెం : ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరవుతున్న జనాలకు నగరంలో ఎక్కడికక్కడ ఏర్పాటు చేసిన చలివేంద్రాలు దాహార్తిని తీరుస్తున్నాయి. మద్దిలపాలెం కూడలిలో శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి సంస్థ సభ్యులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ మంచినీరు అందించడానికి వీలుగా తాత్కాలిక షెల్టర్‌ ఏర్పాటు చేశారు. కేఆర్‌ఎం కాలనీలో వరసిద్ధి వినాయక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో నిత్యం మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. పిఠాపురం కాలనీలో ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తప్పనిసరి పరిస్థితిలో బయటకు వచ్చిన ప్రయాణికులకు వేసవి తాపం నుంచి ఈ చలివేంద్రాలు ఉపశమనం కలిగిస్తున్నాయి.



మద్దిలపాలెం కూడలి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం

ఉద్యోగులు, పెన్షనర్ల రౌండ్‌ టేబుల్‌ సమావేశం నేడు

బీచ్‌ రోడ్డు: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల చైతన్య సదస్సు ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర రహదారులు, భవనాల సంఘం చైర్మన్‌ రామ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మహారాణిపేటలోని రెడ్‌ క్రాస్‌ బ్లడ్‌ బ్యాంక్‌ పక్కన ఉన్న ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో సాయంత్రం 5 గంటల నుంచి ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర రహదారులు, భవనాల ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు పాల్గొనాలని కోరారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



ముడసర్లోవ రోడ్లపై నడుస్తున్న విద్యార్థులు



ఫుట్‌పాత్‌పై యోగా చేస్తున్న ఓ వాకర్‌



ముడసర్లోవ రోడ్లలో వాకర్స్‌ సందడి



యువకుల ముచ్చట్లు

ఆరిలోవ: ఇంట్లో ఉక్కపోత.. రాత్రులు కొన్నిసార్లు విద్యుత్‌ కోతలతో పట్టని నిద్ర.. ఎంత తొందరగా తెల్లవారుతుందా అని ఎదురుచూపులు.. ఆ వెంటనే వాకింగ్‌కు బయలుదేరడం.. ఇదీ వేసవిలో జనాల దినచర్యగా మారింది. చల్లదనం కోసం తెల్లవారేసరికి జనం రోడ్డెక్కుతున్నారు. సూర్యోదయాన ఆరోగ్యం కోసం వాకింగ్‌ చేస్తున్నారు. దీంతో ముడసర్లోవ ప్రాంతంలో బీఆర్‌టీఎస్‌ రోడ్డు రోజూ సందడిగా కనిపిస్తున్నాయి. పెద్దలు, పిల్లలు అనే తేడా లేకుండా వాకింగ్‌ చేస్తున్నారు. సాధారణంగా ముడసర్లోవ రోడ్లు రోజూ వాకర్స్‌తో కళకళలాడుతుంటాయి. పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ఇవ్వడం, విద్యార్థులకు అన్ని రకాల పరీక్షలు పూర్తి కావడంతో వారి సందడి ఎక్కువైంది. ఉదయం, సాయంత్రం పెద్దలతో పాటు పిల్లలు కూడా వచ్చి ఇక్కడ నడుస్తున్నారు. ఆరిలోవ ప్రాంతంతో పాటు రవీంద్రనగర్‌, ఆదర్శనగర్‌, పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం, రామకృష్ణాపురం, విశాఖ కేంద్ర కారాగారం ఉద్యోగులు రోజూ వాకింగ్‌ చేస్తున్నారు. ప్రశాంతమైన వాతావరణం కావడంతో ఈ రోడ్లలో వాకింగ్‌ అనంతరం కొందరు యోగా చేస్తున్నారు. కొంత మంది యువకులు ఓ చోట కూర్చొని సెల్‌ఫోన్లు చూస్తూ ముచ్చట్లు చెప్పుకుంటున్నారు.

బాలల దినోత్సవం పోస్టర్‌ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్‌: అంతర్జాతీయ బాలల దినోత్సవం వాల్‌ పోస్టర్‌ను గురువారం బాల వికాస్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీవీపీ జీవీఎంసీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.జగదీశ్వరరావు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. బాల వికాస్‌ ఫౌండేషన్‌ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా బాలలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఆహారం దొరకని కారణంగా చిన్నారుల మరణాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ కె.అప్పారావు, ఎస్‌.కాంతి కుమారి, పి.రమాదేవి, డాక్టర్‌ బాపూజీ, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్‌ జగదీశ్వరరావు

పాలిసెట్‌ కౌన్సెలింగ్‌కు విశేష స్పందన

మురళీనగర్‌: జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కాలేజీల్లో గురువారం నిర్వహించిన పాలిసెట్‌ కౌన్సెలింగ్‌కు అత్యధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. గైస్‌లో 43,001– 51,000, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 51,001–59,000, పెందుర్తిలో 43,001–59,000 ర్యాంకుల విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించగా.. 569 మంది సర్టిఫికెట్లు పరిశీలించారు. గైస్‌లో 239 మంది, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 264 మంది, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 66 మంది కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. కంచరపాలెం పాలిటెక్నిక్‌ కళాశాలలో ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.నారాయణరావు, గైస్‌లో ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.వెంకటరమణ, పెందుర్తి పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎస్‌.చంద్రశేఖర్‌ కౌన్సెలింగ్‌ ప్రక్రియను పర్యవేక్షించారు.



గైస్‌లో విద్యార్థుల కౌన్సెలింగ్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్‌ వెంకటరమణ

నేటి కౌన్సెలింగ్‌ వివరాలు : శుక్రవారం నిర్వహించే సర్టిఫికెట్ల పరిశీలనకు గైస్‌లో 59,001–67,000, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 67,001–75,000, పెందుర్తి పాలిటెక్నిక్‌ కాలేజీలో 59,001–75,000 ర్యాంకర్లు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోగా హాజరు కావాల్సి ఉంది. ఎస్టీ విద్యార్థులు కంచరపాలెం పాలిటెక్నిక్‌ కళాశాలకు హాజరవ్వాల్సి ఉంటుంది.

సముద్ర కాలుష్యంపై అవగాహన అవసరం

బీచ్‌ రోడ్డు: సముద్ర కాలుష్యం మత్స్య జీవరాసులపై తీవ్ర ప్రభావం చూపుతుందని భారతీయ మత్స్య పరిశోధన సంస్థ ముఖ్య అధికారి డి.బామిరెడ్డి తెలిపారు. గురువారం బీచ్‌రోడ్డులోని భారతీయ మత్స్య పరిశోధన సంస్థలో సముద్ర కాలుష్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోస్ట్‌ ఫిషింగ్‌, ప్లాస్టిక్‌ వ్యర్థాల వల్ల సాగర జలాలు కలుషితం అవుతున్నాయన్నారు. తద్వారా మత్స్య సంపద తగ్గుతుందన్నారు. ఈ కాలుష్యాన్ని నియంత్రించేందుకు మత్స్యకారులు తమ వంతు కృషి చేయాలన్నారు. అనంతరం సముద్రం కాలుష్యం వల్ల కలిగే నష్టాలను వీడియోల రూపంలో ప్రదర్శించారు. నూతన మెరైన్‌ మ్యూజియంను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సైంటిస్ట్‌ ఇన్‌చార్జి డాక్టర్‌ యు.శ్రీధర్‌, అసిస్టెంట్‌ డైరెక్టర్‌ ఆర్‌.ప్రసాద్‌ నాయక్‌, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బామిరెడ్డి

పర్యావరణ మార్పులపై సెప్టెంబర్‌లో సదస్సు



సదస్సు పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు

ఏయూ క్యాంపస్‌: ఆంధ్ర విశ్వవిద్యాలయం సముద్ర అధ్యయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ‘వాతావరణ మార్పు అధ్యయనాలకు సంబంధించి వాతావరణ సముద్ర ప్రక్రియల్లో ప్రస్తుత పోకడలు’ అంశంపై జాతీయ సదస్సును సెప్టెంబర్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సముద్ర అధ్యయన శాస్త్ర విభాగం సెప్టెంబర్‌లో ప్లాటినం జూబ్లీ వేడుకలను జరుపుకోనుంది. దీనిలో భాగంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్‌ ఆచార్య ఎం.జేమ్స్‌ స్టీఫెన్‌, ప్రిన్సిపాల్‌ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య పి.సునీత, బీవోఎస్‌ చైర్మన్‌ ఆచార్య సి.వి.నాయుడు, ఆచార్య ఒ.ఎస్‌.ఆర్‌.భానుకుమార్‌, ఆచార్య విఠల్‌ మూర్తి, డాక్టర్‌ ఆర్‌.ఆర్‌.రావు, డాక్టర్‌ సి.వి.కె.ప్రసాదరావు, డాక్టర్‌ వి.ఎస్‌.ఎన్‌.మూర్తి, డాక్టర్‌ కె.సోమసుందర్‌ పాల్గొన్నారు.

యువ పారిశ్రామికవేత్తలకు అవకాశాలు మెండు



యూబీఐ జోనల్‌ హెడ్‌ శాలిని మీనన్‌కి జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు



సదస్సులో పాల్గొన్న యువ పారిశ్రామిక వేత్తలు, అధికారులు

ఏయూ క్యాంపస్‌: స్వశక్తితో ఎదిగే యువ పారిశ్రామికవేత్తలకు అనేక అవకాశాలు ఉంటున్నాయని యూనియన్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా జోనల్‌ హెడ్‌ శాలిని మీనన్‌ అన్నారు. గురువారం ఎంవీపీ కాలనీ గాయత్రి విద్యా పరిషత్‌ కళాశాలలో రోటరీ క్లబ్‌ విశాఖపట్నం 3020, ఏపీ చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ ఇండస్ట్రీస్‌, యూబీఐ సంయుక్తంగా యువ పారిశ్రామికవేత్తల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపార రంగంలో రాణించాలని ఆకాంక్షించే వారికి అనేక వేదికలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. ఎంఎస్‌ఎంఈల ద్వారా రుణాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రోటరీ క్లబ్‌ విశాఖపట్నం అధ్యక్షుడు ఆర్‌.టి.ఎస్‌.డి.మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు కల్పించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ జోనల్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ లీలారాణి, ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ ఎం.చంద్రమౌళి, ఎస్‌ఆర్‌డీసీ రీజినల్‌ మేనేజర్‌ బి.కె.సాహు, ఉపేంద్ర శ్రీనివాస్‌, రోటరీ క్లబ్‌ విశాఖపట్నం కార్యదర్శి పి.వి.రఘుపతి, పెద్ద సంఖ్యలో యువ పారిశ్రామికవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

268 మందికి అడల్ట్‌ బీసీజీ వ్యాక్సిన్‌

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు బాలాజీనగర్‌ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వృద్ధులకు బీసీజీ టీకాలు(అడల్ట్‌ బీసీజీ వ్యాక్సినేషన్‌) వేసే కార్యక్రమం నిర్వహించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ కిరణ్‌లలిత దేవి పర్యవేక్షణలో 12 సచివాలయాల పరిధిలో వైద్య సిబ్బంది వ్యాక్సిన్‌ వేశారు. ముస్తఫా కాలనీలో అమ్మానాన్న సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీవీఎంసీ నైట్‌ షెల్టర్‌లో వృద్ధులు, నిరాశ్రయులకు బీసీజీ టీకాలు వేశారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎం, టీబీ విభాగం సిబ్బంది నైట్‌ షెల్టర్‌లో నిరాశ్రయులతో పాటు 12 సచివాయాల పరిధిలో 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు, గతంలో టీబీతో బాధపడుతూ మందులు వాడేవారికి, వారి ఇంటి సభ్యులకు, పొగతాగడం అలవాటు ఉన్నవారికి టీకాలు వేసినట్లు డాక్టర్‌ కిరణ్‌ లలిత దేవి తెలిపారు. మొత్తం 268 మందికి యాంటీ టీబీ వ్యాక్సిన్‌ వేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ విభాగం సిబ్బంది లక్ష్మి, ఏఎన్‌ఎం రాధ, ఆశా వర్కర్‌ లలిత పాల్గొన్నారు.



ఆరిలోవ నైట్‌ షెల్టర్‌లో నిరాశ్రయిలకు బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ఇంటర్‌ పరీక్షలకు 45 మంది గైర్హాజరు

మద్దిలపాలెం : డాక్టర్‌ వీఎస్‌ కృష్ణా ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్మీడియెట్‌ సప్లిమెంటరీ పరీక్షలకు 45 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్‌ సూపరింటెండెంట్‌ కృష్ణారావు తెలిపారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్‌ పరీక్షలకు 326 మంది హాజరు కావాల్సి ఉండగా.. 24 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. వారిలో కెమిస్ట్రీ పరీక్షకు 18, కామర్స్‌ పరీక్షకు ఆరుగురు హాజరు కాలేదన్నారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షను 325 మందికి 304 మంది పరీక్ష రాశారు. 21 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. కెమిస్ట్రీ పరీక్షకు 13 మంది, కామర్స్‌ పరీక్షకు 8 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.